క్లుప్తంగా

నిమజ్జనాలు సక్రమంగా జరిగేలా చర్యలు

- పిఠాపురం సీఐ శ్రీనివాస్


ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

కొత్తపల్లి: గణేశ్ విగ్రహ నిమజ్జనాలు సక్రమంగా జరిగేలా భక్తులు సహకరించాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ అన్నారు. నిమజ్జనాలు చేయనున్న మండలంలోని ఉప్పాడ తీర ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిమజ్జన సమయంలో కమిటీ సభ్యులు నిబంధలను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తీర ప్రాంతానికి మండలంతో పాటు, పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కిర్లంపూడి, పెద్దాపురం మండలాల నుంచి అధిక సంఖ్యలో విగ్రహాలను తరలించనున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గుర్తించిన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జనం చేసేలా కమిటీ సభ్యులకు నిర్దేశించాలని చెప్పారు. తీరంలో తాగునీరు, పారిశుద్ధ్యం, లైటింగ్, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట ఎస్సై వెంకటేష్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో షిర్డీ సాయికి స్తవన మంజరి


గులాబీ పూలతో పూజలు చేస్తున్న భక్తులు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో స్తవన మంజరి కార్యక్రమం నిర్వహించారు. 25 ఏళ్లకోసారి భాద్రపద మాసంలో స్తవన మంజరి కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.అప్పారావు తెలిపారు. దీనిలో భాగంగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సత్తి అరుణ ఆధ్వర్యంలో స్తవన మంజరి పారాయణ నిర్వహించారు. బాబా వారికి వెయ్యి గులాబీ పూలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి గంధ్రోతుల సత్యనారాయణ, కోశాధికారి డి రాజబాబు, భజన కమిటీ నాయకులు కొప్పన రాంబాబు తదితరులు భక్తులకు సేవలందించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

ఉత్సాహంగా గణేశ్ విగ్రహ నిమజ్జనం


సామర్లకోటలో జరిగిన గణేశ్ నిమజ్జన ఊరేగింపు

సామర్లకోట: గణపతి నవరాత్రుల్లో భాగంగా స్థానిక విశాలాక్షి నగర్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ శిబిరం వద్ద నుంచి గురువారం సాయంత్రం నిమజ్జన ఊరేగింపు భక్తిశ్రద్ధలతో సాగింది. గణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఐదు రోజులు పూర్తి కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ప్రజలకు నిర్వాహకులు క్విజ్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఇలాఉండగా విశాలాక్షి నగర్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్, స్టేషన్ సెంటర్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా పంచారామ క్షేత్ర ముఖద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ రేవుకు చేరింది. అక్కడ గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

ఘనంగా భువనేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవం


భువనేశ్వరి పీఠంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న గోపిశర్మ సిద్ధాంతి

పెద్దాపురం: భువనేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవం స్థానిక వర్జులవారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి వేద మంత్రోచ్ఛరణ మధ్య అభిషేక కార్యక్రమాలు జరిపించారు. అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పీఠాధిపతి గోపిశర్మ మాట్లాడుతూ, పీఠంలో మూడు రోజులుగా పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పట్టణంలో స్టాళ్లు ఏర్పాటు చేసి అమ్మవారి ప్రసాద వితరణ చేశామన్నారు. ముగింపు రోజైన గురువారం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ముంపులో ఉన్న మార్కండేయపురం


వరద నీటితో నిండిన మగ్గం గొయ్యి

ఆధారం కన్నీటిపాలు


వరద నీటిలో తడిసిన ఊలు

- నేతన్నను నిండా ముంచిన వరద
- గొల్లప్రోలులో ముంపులోనే చేనేత మగ్గాలు
- వర్షాలతో రెండు వారాలుగా స్తంభించిన చేనేత కార్యకలాపాలు

పిఠాపురం: హల్లు కదలడం లేదు.. నాడి ఊగడం లేదు.. కాలు కదిపితే నాళ్ల కింద నీరు.. ఇదీ గొల్లప్రోలులో చేనేత కార్మికుల దుస్థితి. గత రెండు వారాలుగా కురుస్తున్న భారీ వర్షాలతో చేనేత కుంటుపడింది. వర్షాల్లో ఏదో విధంగా నేత నేసుకుంటున్న చేనేత కార్మికులకు ఏలేరు వరద కన్నీరే మిగిల్చింది. నేత నేస్తేనే కానీ పూట గడవని చేనేత కుటుంబాల్లో జీవనోపాధిని దెబ్బ తీసింది. గత మూడు రోజులుగా వచ్చిన వరద గొల్లప్రోలు మార్కండేయపురంలో ఉన్న చేనేత కుటుంబాల బతుకులను ముంచెత్తింది. సుమారు 150కి పైగా చేనేత మగ్గాలు నీట మునిగాయి. దీంతో మూడు రోజులుగా చేనేత పనులు నిలిచిపోవడంతో పాటు, నూలు ఇతర చేనేత సామాన్లు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని నేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మగ్గాల గోతుల్లోకి నీరు చేరడంతో, మరో రెండు లేదా మూడు రోజుల పాటు నేత నేసే అవకాశం లేదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోతుల్లో నీరు తోడుకుంటున్నా తగ్గడం లేదని, పూర్తి వరద తగ్గుముఖం పడితేనే కానీ నేత నేసే అవకాశం లేదంటున్నారు. గత 15 రోజుల నుంచి నేత పని నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను కష్టాలను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని గొల్లప్రోలుకు చెందిన నేత కార్మికుడు వానపల్లి దుర్గారావు కోరుతున్నాడు.


ఇసుకపల్లిలో చెరువును తలపిస్తున్న పొలాలు


రమణక్కపేటలో రోడ్డుపై పొంగిపొర్లుతున్న వరద నీరు


నాగులాపల్లిలో పొలాల పరిస్థితి ఇలా..

ముంపులోనే పొలాలు

– రహదారుల్లో పారుతున్న వరద నీరు

కొత్తపల్లి: ఏలేరు అదనపు జలాలు విడుదలతో అనేక గ్రామాలతో పాటు, పొలాలన్నీ జలమయమయ్యాయి. గురువారం ముంపు నీరు కాస్తంత తగ్గుముఖం పట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నాగులాపల్లి–మూలపేట, నాగులాపల్లి–పిఠాపురం, నాగులాపల్లి–రమణక్కపేట రహదారుల్లో ఇంకా ముంపునీరు ప్రవహిస్తోంది. దీంతో జన జీవనానికి, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇసుకపల్లి, నాగులాపల్లి, కొత్త ఇసుకపల్లి, రమణక్కపేట తదితర గ్రామాల్లోని పొలాలు ముంపులోనే ఉన్నాయి. వరద నీట మునిగిన కొండెవరం శివారు కాశివారిపాకలు, ఎండపల్లి శివారు తోటూరు, నాగులాపల్లి ఎస్సీపేట, రమణక్కపేట ఎస్సీపేటల్లో ముంపు నీరు కొంచెం తగ్గుముఖం పట్టింది. శుక్రవారం నుంచి గ్రామాల్లో వరద నష్టం సర్వే నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకట నారాయణ తెలిపారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన నారాయణరెడ్డి


మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకుడు నారాయణరెడ్డి

కొత్తపల్లి: ఏలేరు వరద ఉధృతితో నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో నాగులాపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి, సర్పంచ్ గుర్రాల చిరంజీవికుమార్ గురువారం కలిశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత సూచనల మేరకు వారు ఆయనను కలిసి పంటలు, గ్రామాల ముంపుపై వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన నేతలు


కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

సామర్లకోట: మండలంలోని వీకే రాయపురం గ్రామానికి చెందిన పలువురు నాయకులు, అధికారులు గురువారం కలెక్టర్ షణ్మోహన్‌ను కాకినాడ కలెక్టరేట్‌లో కలిశారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి అదనపు జలాలు విడిచిపెట్టడంతో, వరద నీరు ఏలేరు కాలువ నుంచి సముద్రంలోకి వెళ్లే క్రమంలో వీకే రాయపురం వద్ద కాలువ గట్టు కోతకు గురైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్.. జేసీ రాహుల్ మీనాను పంపడంతో పాటు, కోతకు గురైన గట్టు గండిని పూడ్చేందుకు నిధులు మంజూరు చేశారు. దీంతో గండి పూడ్చివేత సాధ్యమైంది. ఈ నేపథ్యంలో సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుర్రా నారాయణ స్వామి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, పంచాయతీ కార్యదర్శి వై శ్రీహరి, పలువురు గ్రామ పెద్దలు కలెక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు.

‘స్వచ్ఛతా హీ సేవ’తో క్లీన్ కాకినాడ


అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ భావన

- కార్పొరేషన్ కమిషనర్ భావన

కాకినాడ సిటీ: స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు చేపట్టే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంతో కాకినాడ నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. గురువారం రాత్రి అదనపు కమిషనర్ టీకే సుధాకర్, ఎస్ఈ సత్యకుమారి, ఈఈ మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీ ఆర్వో శైలజ, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ తదితర విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో చెత్త నిల్వలు లేకుండా చూడడం, చెత్త నుంచి సంపద సృష్టి, మురుగు కాల్వలను శుభ్రపరచడం, పూడికల తొలగింపు, పారిశుధ్య కార్మికులకు అవార్డుల ప్రదానం వంటి కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతా కీ భాగేదారీ, సంపూర్ణ స్వచ్ఛతా, సఫాయి మిత్ర సురక్ష వంటి కీలకాంశాల ఆధారంగా నిర్వహించాలని వివరించారు. స్వచ్ఛతా కీ భాగేదారీలో ప్రజలను భాగస్వాములను చేయడం, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేలా అవగాహన కార్యక్రమాల నిర్వహణ, పరిశుభ్రతపై ర్యాలీలు చేపట్టాలని ఆదేశించారు. సుమారు 15 రోజుల పాటు సాగే ఆయా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, కాకినాడను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కమిషనర్ భావన పిలుపునిచ్చారు.

అవినీతి ఆరోపణలపై డీఎల్పీఓ విచారణ

- తూరంగి పంచాయతీ కార్యదర్శి, బిల్లు కలెక్టర్లపై అందిన ఫిర్యాదులు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి పంచాయతీకి చెందిన గ్రామ కార్యదర్శి, బిల్లు కలెక్టర్లపై వచ్చిన అవినీతి ఆరోపణలపై డివిజనల్ పంచాయతీ అధికారి అన్నామణి గురువారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, బిల్లు కలెక్టర్ వీరబాబులు పంచాయతీలో అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తూరంగి పంచాయతీ అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణపై విచారణ చేపట్టాలని డీఎల్పీఓ అన్నామణిని డీపీఓ ఆదేశించారు. దీంతో ఆమె గురువారం శాఖాపరమైన విచారణ చేపట్టారు. ఈ విచారణను పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, బిల్లు కలెక్టర్ వీరబాబు, ఫిర్యాదుదారుడు సబ్బతి ఫణీశ్వరరావు సమక్షంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అనధికార లేఅవుట్లను ప్రోత్సహించి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు కాజేసి, దొడ్డిదారిన అనుమతులిచ్చారని వివరించారు. తనకు లంచం ముట్టజెప్పకపోతే అధికారకంగా అన్ని పన్నులు చెల్లించి, అనుమతులున్న లేఅవుట్లను, సీసీ రోడ్లను ధ్వంసం చేసిన సందర్భాలను, ఆధారాలను విచారణ అధికారి అన్నామణికి ఫణీశ్వరరావు అప్పగించారు. అదేవిధంగా ఒకే పంచాయతీలో సుమారు 12 ఏళ్లుగా పని చేస్తున్న బిల్లు కలెక్టర్ వీరబాబు అవినీతి పెచ్చుమీరిందని, ముడుపులు లేనిదే పని చేయడని వివరించారు. 12 ఏళ్లుగా ఒకేచోట పని చేస్తున్న వీరబాబును ఎందుకు బదిలీ చేయడం లేదో తెలపాలని ఫణీశ్వరరావు డీఎల్పీఓను నిలదీశారు. అదే విధంగా పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు పాల్పడిన అవినీతి అక్రమాలకు సంబంధించిన పలు ఆధారాలను తూరంగి హోప్ ఐలాండ్ కాలనీకి చెందిన ఊబా రాజ్‌కుమార్ డీఎల్పీఓ దృష్టికి తీసుకెళ్లి, ఆ విషయాలను విలేకర్లకు వివరించారు.

పని కోసం నిలదీసిన కూలీలు

- సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులకు చుక్కెదురు

కొత్తపల్లి: తమ జాబ్ కార్డులు రద్దయి పోయాయని పని కల్పించడం లేదని, కొత్త కార్డులు ఇవ్వకపోవడంతో జీవనోపాధి కోల్పోతున్నామంటూ పొన్నాడకు చెందిన పలువురు ఉపాధి కూలీలు అధికారులను నిలదీశారు. కూలీలు ఆకస్మికంగా నిలదీయడంతో అధికారులు అవాక్కయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం 2023–24 ఆర్థిక సంవత్సర సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఏపీడీ వసంతమాధవి ఈ సామాజిక తనిఖీ ప్రజావేదికకు హాజరయ్యారు. మొత్తం 1,171 పనులకు వేతనాలుగా రూ.9.70.98.986, మెటీరియల్ రూపంలో రూ.10.92.761 ఖర్చుకు సంబంధించి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మస్టరు దిద్దివేత, రాని వారికి మస్టర్లు వేయడం, వేలిముద్రలు వేయించకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.46 వేలను రికవరీ చేశారు. రూ.5 వేలను పెనాల్టీ రూపంలో వసూలు చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు హాజరయ్యే కూలీలు తమ పనిముట్లను వెంట తీసుకురావాలని స్పష్టం చేశారు. ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగినా సంబంధిత అధికారులు కప్పిపుచ్చుతున్నారంటూ పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ఏడాకి ఒకసారి కాకుండా, ఆరు నెలలకు పనులపై ప్రజావేదిక నిర్వహించాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ పని

పీడీ మాట్లాడుతూ పని కావాలన్న ప్రతిఒక్కరికీ పని కల్పిస్తున్నామని చెప్పారు. గుర్తించిన పనులు చేపడుతూ, అవసరమైన వారికి జాబ్ కార్డులను మంజూరు చేస్తున్నామన్నారు.. ఉపాధి పనులకు కూలీలు ఉదయం 6 గంటలకు హాజరు కావాలని, సకాలంలో హాజరు కాని కూలీలకు మస్టరు వేయరాదని ఆదేశించారు. జిల్లాలో ప్రతీరోజూ సుమారు 8 వేల మంది కూలీలకు పని కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ రవిశంకర్, సోషల్ ఆడిట్ డీఈఓ రాజేష్, ఎంపీడీఓ వెంకట నారాయణ, ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఏపీఓ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


పని కల్పించాలని అధికారులను నిలదీస్తున్న ఉపాధి కూలీలు

హైస్కూల్‌కు రూ.20 వేల విరాళం


దాతను సత్కరిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

సామర్లకోట: స్కూలు అభివృద్ధి కోసం స్థానిక బ్రౌన్‌పేటలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు మాగాపు ఆనందశాస్త్రి గురువారం రూ.20 వేల విరాళం అందజేశారు. ఈ మొత్తంతో హైస్కూల్‌లోని విద్యుత్ వైరింగ్ పనులు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయనకు హెచ్ఎం మీనా మాధురి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పాలిక చంటి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలక పక్ష నేతలవి ప్రగల్భాలే..

- రైతు కూలీ సంఘం రాష్ట్ర నేత కర్నాకుల


ముంపు పొలంలో నిలబడి నిరసన తెలుపుతున్న రైతు కూలీలు

పెద్దాపురం: రైతు కుటుంబంలో పుట్టామని ప్రగల్భాలు పలికే పాలక పక్ష నేతలకు.. ఎకరాకు ఎంత పెట్టుబడి అవుతుందో తెలియదా అని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ప్రశ్నించారు. ఏలేరు ముంపు వల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం చెల్లించే వరకూ రైతుల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. మండలంలోని దివిలిలో ఏలేరు వరద వల్ల నష్టపోయిన వరి పంటల్లో రైతు కూలీలు గురువారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర ఎకరాకు రూ.పది వేలు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని, ఎకరాకు రూ.30 వేలు ఇచ్చే వరకు పోరాడతామంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ, ఏలేరు కాలువ ఆక్రమణలకు గురికావడం, ఇసుక మాఫియా వల్లే ఏటా పెద్దాపురం, కిర్లంపూడి, పిఠాపురం మండలాల్లో వరదలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సత్వరమే రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, నాయకులు ముసిలిబాబు, నాగేశ్వరరావు, భూషణం, వీరబాబు, రైతు కూలీలు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ పూజలు

బోట్‌క్లబ్: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక ద్వారకానగర్‌లో ఉన్న గణపతి మంటపంలో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో సరస్వతీ పూజలు ఘనంగా నిర్వహించారు. సుమారు 300 మంది చిన్నారులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అంకంరెడ్డి రామునాయుడు సరస్వతీ పూజల్లో పాల్గొన్న చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పరీక్షల ప్యాడ్లు అందించారు. ఈ కార్యక్రమంలో గణేశ్ యూత్ సభ్యులు యనమదల నాగేశ్వరరావు, వెలుదుర్తి వీరబాబు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక పేర్రాజుపేట కరసూదివారి వీధిలోని బాలగణేశ్ యూత్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి సరస్వతీ పూజలు నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందించారు.


ద్వారకానగర్‌లో సరస్వతీ పూజల్లో పాల్గొన్న చిన్నారులు

ఇక్కడ తగ్గి.. అక్కడ పెరిగి..!


వరద నీటిలోనే పాత ఇసుకపల్లిలోని జనావాసాలు


వరద నీటిలో కొత్తపల్లి మండలం ఇసుకపల్లి గ్రామం


గొల్లప్రోలులో ముంపు నుంచి తేరుకుంటున్న వరిచేలు

- పిఠాపురంలో తగ్గుముఖం పట్టిన వరద
- కొత్తపల్లి మండలంలో కొనసాగుతున్న ఖైనం
- ఇంకా నీటిలోనే పంటలు, జనావాసాలు

పిఠాపురం: మూడు రోజులుగా పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో బీభత్సం సృష్టించిన ఏలేరు వరద క్రమేపి తగ్గుముఖం పట్టింది. ఈ వరద నీరంతా దిగువ ప్రాంతమైన కొత్తపల్లి మండలానికి చేరడంతో, రెండు రోజులుగా వందలాది ఎకరాల పొలాలు, గ్రామాల్లో వరద కొనసాగుతూనే ఉంది. పిఠాపురం, గొల్లప్రోలులో తగ్గుతున్న వరద.. కొత్తపల్లి మండలంలో మాత్రం పెరుగుతోంది. ఏలేరు నుంచి నీటి విడుదల తగ్గిపోవడంతో ప్రస్తుతం వరద ఉధృతి తగ్గగా, ఇప్పటికే వచ్చిన వరద నీరు పిఠాపురం, గొల్లప్రోలు నుంచి కొత్తపల్లి మండలం మాధవపురం, ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట మీదుగా ఉప్పాడ సముద్రంలో కలుస్తోంది. దీంతో కొల్లపల్లి మండలంలో వరద ఉధృతి కొనసాగుతోంది. బుధవారం నిండా మునిగిన కొత్తపల్లి మండలం మాధవపురం, ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట గ్రామాలు ఇంకా వరద నీటిలోనే ఉండడంతో. స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.